1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


Good for Health
Best for Readers
THE POWER OF PEN
RK

సంపుటి : 2 సంచిక : 247 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 09 ఆగస్టు 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 247 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 09 August 2025 PAGES : 8 PRICE : 3/-

## 'ఓట్ల చోరీ'పై రాహుల్ గాంధీ ప్రశ్నలు తీవ్రమైనవే: శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 08)

భాజపా, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై ఆ పార్టీ సీనియర్ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ లేవనెత్తిన అనుమానాలు తీవ్రమైనవేనని సొంత నేతకు మద్దతుగా నిలిచారు. దీనిపై ఈసీ తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలను విభేదిస్తూ వస్తోన్న శశిథరూర్ తాజాగా రాహుల్‌గాంధీకి మద్దతు పలకడం గమనార్హం. దేశంలో ఓటర్ల జాబితాకు సంబంధించి -మిగతా 2లో



## హోటళ్లకు మంత్రి నాదెండ్ల హెచ్చరిక.. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలే!

ఆహార నాణ్యత పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి నాదెండ్ల
విశాఖలో 51 రెస్టారెంట్లలో 44 నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు వెల్లడి
హానికర పదార్థాలతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన
ఈ అంశంపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం అధికారులకు ఆదేశాలు జారీ
బయట ఆహారం తినేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 08)

రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులలో ఆహార నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలితే కఠిన -మిగతా 2లో

## ఎస్‌సీవో సదస్సుకు మోదీ.. స్వాగతించిన చైనా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 08)

ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సిద్ధమవుతున్నారనే వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించిన బీజింగ్.. ప్రధాని మోదీ పర్యటనను స్వాగతించింది. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేసింది.ద్వైపాక్షిక వార్షిక సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఎస్‌-సీవో సభ్యదేశాలు సహా 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఇందుకు హాజరుకానున్నారని చెప్పారు. అయితే, ప్రధాని జపాన్, చైనా పర్యటనలకు సంబంధించి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

## అవన్నీ చిల్లర విమర్శలు.. పట్టించుకోను మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 08)

వీఆర్‌సీ హైస్కూల్‌పై వైకాపా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి మంత్రి నారాయణ ఘాటుగా స్పందించారు. వైకాపావి అర్థం లేని ఆరోపణలంటూ మండిపడ్డారు. తనపై మాట్లాడేందుకు -మిగతా 2లో

# కూటమి నేతలంతా కలిసి పులివెందులను గెలుచుకురండి

ఏపీ రాజకీయాలను హీటెక్కిస్తున్న పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక
40 మంది కూటమి నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
జగన్ చేయని విధంగా పులివెందులను అభివృద్ధి చేద్దామన్న చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 08)

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను ఇటు అధికారంలోని కూటమి పార్టీలు, అటు వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి భార్య మారెడ్డి లతారెడ్డి, వైసీపీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్ రెడ్డి ఎన్నికల బరిలోకి దిగారు. ఇరు పక్షాలకు చెందిన కీలక నేతలు పులివెందులలో మకాం వేసి హోరాహోరీగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి నేతలకు కీలక సూచన చేశారు. కూటమి నేతలంతా కలిసి ఒక సంకల్పంతో పులివెందుల జడ్పీటీసీని గెలుచుకురావాలని చెప్పారు. పులివెందుల అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి కూటమికి చెందిన 40 మంది నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. -మిగతా 2లో



## వైసీపీపై ఉన్న కోపాన్ని వైఎస్ఆర్ విగ్రహాల మీద చూపిస్తారా?: షర్మిల

నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించారన్న షర్మిల
వైఎస్ఆర్... వైసీపీ సొంతం కాదని స్పష్టీకరణ
కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని విమర్శలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 08)

నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వైసీపీపై ఉన్న రాజకీయ కోపాన్ని ప్రజానాయకుడు వైఎస్ఆర్ విగ్రహాలపై చూపించడం దారుణమని ఆమె విమర్శించారు. "వైఎస్ఆర్ గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చివరి క్షణం వరకు ప్రజల కోసం తన ప్రాణాలను అర్పించారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి దిశానిర్దేశం చేశాయి. అలాంటి మహానేత పేరు పెట్టుకున్నంత మాత్రాన -మిగతా 2లో



## 'ఉజ్వల' కొనసాగింపు, సాంకేతిక విద్యకు 'మెరిట్' స్కీమ్.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

2



## వాణిజ్య యుద్ధం వేళ భారత్‌కు మరింత చౌకగా రష్యా చమురు..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 08)

ఓ పక్క అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు, బెదిరింపులు.. మరోవైపు ఐరోపా సమాఖ్య ఆంక్షల వేళ రష్యా భారీ డిస్కౌంట్‌తో చమురును భారత్‌కు ఆఫర్ చేస్తోంది. ఈ విషయాన్ని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కేపీఎల్‌ఈఆర్ లిమిటెడ్ పేర్కొంది. ఉరల్స్ గ్రేడ్ క్రూడ్ డేటెడ్ బ్రెంట్ చమురు కంటే ఐదు డాలర్లు చౌకగా ఉంది. ఇవి దాదాపు రెండు వారాల క్రితం ఒకే రకంగా ఉండేవి.అమెరికా చర్యలు ఊహాతీతంగా ఉండటంతో.. ఉరల్స్ చమురు ధరలు మరింత పతనం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే అమెరికా సెకండరీ ఆంక్షల భయం కారణంగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రష్యా నుంచి కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. అగస్ట్ నుంచి అక్టోబర్ మధ్యలో రష్యా చమురు -మిగతా 2లో



## 'మైక్రోసాఫ్ట్‌ను ఓపెన్ ఏఐ తినేస్తుంది'.. మస్క్ వ్యాఖ్యలపై స్పందించిన సత్య నాదెళ్ల

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 08)

ఓపెన్ ఏఐ సంస్థ తాజాగా తన పవర్‌ఫుల్ ఏఐ మోడల్ 'చాట్‌జీపీటీ-5'ని పరిచయం చేసింది. ఈ నేపథ్యంలో టెస్లా, ఎక్స్‌ఏఐ సంస్థల సీఈఓ ఎలాన్ మస్క్ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఓపెన్ ఏఐ మైక్రోసాఫ్ట్‌ను ఏదో రోజు తినేస్తుంది' అంటూ ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు. దీనిపై సత్య నాదెళ్ల కూడా అదేస్థాయిలో స్పందించారు. ఇంతకీ ఏం జరిగిందంటే?జీపీటీ-5 విడుదల, పనితీరు, సామర్థ్యం గురించి మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల తాజాగా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఈ రోజు నుంచి జీపీటీ-5.. మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, కోపైలట్, వంటి అన్ని ప్లాట్‌ఫాంల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇది -మిగతా 2లో



## వైసీపీకి పులివెందులలో ఓటమి భయం పట్టుకుంది

వైసీపీ నేతలపై మంత్రి సవిత ఫైర్
డైవర్షన్ పాలిటిక్స్ తో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శ
వైసీపీ దాడుల వల్లే సునీత పులివెందులకు రాలేకపోతున్నారని వ్యాఖ్య
దాడులు చేసి ఆ నిందను టీడీపీపై మోపుతున్నారని ఆరోపణ
సూపర్ సిక్స్ పథకాలతో పులివెందులలో టీడీపీ గెలుపు ఖాయమని ధీమా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 08)

పులివెందులలో వైసీపీ నాయకులు ఓటమి భయంతో డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని రాష్ట్ర మంత్రి సవిత తీవ్రస్థాయిలో ఆరోపించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోతామనే ఆందోళనతోనే వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తూ, ఆ నిందను టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆమె విమర్శించారు.

పులివెందులలో నెలకొన్న పరిస్థితులపై మంత్రి సవిత మాట్లాడుతూ, "వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలు, బెదిరింపుల కారణంగా వైఎస్ వివేకానంద రెడ్డి జయంతి కార్యక్రమానికి -మిగతా 2లో

# ‘ఓట్ల చోరీ’పై రాహుల్ గాంధీ ప్రశ్నలు తీవ్రమైనవే: శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్ విశ్లేషణపై రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ‘ఓట్ల చోరీ విధానం’ దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని ఆయన ఆరోపించారు. దీనికి ‘మహాదేవపుర’ ఓటర్ల జాబితాయే నిదర్శనమన్నారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్లు చోరీకి గురైనట్లు తేలిందన్నారు. రాహుల్ ఆరోపణలపై శశిథరూర్ శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందించారు. “ఇవి చాలా తీవ్రమైన ప్రశ్నలు. అన్ని పార్టీలు, ఓటర్ల ప్రయోజనాల దృష్ట్యా ఈ సందేహాలను తప్పకుండా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. మన ప్రజాస్వామ్యం చాలా విలువైనది. నిర్లక్ష్యంగా లేదా ఉద్దేశపూర్వకంగా దాని విశ్వసనీయతను దెబ్బతీయాలని చూసే చర్యలను ఎన్నటికీ అనుమతించకూడదు. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలి. దీనిపై దేశ ప్రజలందరికీ సమాచారం అందించాలి” అని థరూర్ రాసుకొచ్చారు. కాగా.. రాహుల్ ఆరోపణలను భాజపా తిప్పికొట్టింది. కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించకపోవడంతో నిరాశ, కోపానికి గురై ఈసీ పై ఆరోపణలకు దిగుతున్నారని మండిపడింది. ఇటీవల శశిథరూర్, కాంగ్రెస్ అధిష్ఠానం మధ్య దూరం పెరిగిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ సిద్ధాంతాలను ఆయన బహిరంగంగానే విమర్శించడం.. ప్రధాని మోదీ, కేంద్రం విధానాలను ప్రశంసించడం వంటివి కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆగ్రహం తెప్పించాయి. ఈక్రమంలోనే ఆయన పార్టీని వీడనున్నారనే ప్రచారం కూడా జరిగింది. ఈ పరిణామాల వేళ తాజాగా ఆయన రాహుల్‌కు మద్దతుగా పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# హోటళ్లకు మంత్రి నాదెండ్ల హెచ్చరిక.. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలే!

చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని, ఈ విషయంలో ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన తనిఖీలలో వెలుగు చూసిన వాస్తవాలు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి తెలిపారు. అక్కడ తనిఖీ చేసిన 51 రెస్టారెంట్లలో ఏకంగా 44 చోట్ల ఆహార నాణ్యతా నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నట్లు అధికారులు గుర్తించారని ఆయన వివరించారు. పాడైపోయిన ఆహారాన్ని వడ్డించడం, పరిశుభ్రత పాటించకపోవడం, హానికర రంగులు వాడటం వంటి అనేక లోపాలను గుర్తించి, వాటిపై చర్యలకు అవసరమైన ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు.“కొన్ని హోటళ్ల నిర్వాహకులు నాసిరకం, హానికరమైన పదార్థాలను వంటకాలలో కలుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు” అని నాదెండ్ల మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం కూడా చర్చించిందని, నిబంధనలు పాటించని సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేస్తామని, నిబంధనలు మీరినట్లు తేలితే ఎంతటి పెద్ద సంస్థలపై అయినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ప్రజలు కూడా బయట ఆహారం తీసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యతపై ఏమాత్రం అనుమానం వచ్చినా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# వైసీపీకి పులివెందులలో ఓటమి భయం పట్టుకుంది

హాజరయ్యేందుకు ఆయన కుమార్తె సునీత కూడా భయపడుతున్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న దాడుల వెనుక వైసీపీ నేతలే ఉన్నారు. వారే దాడులు చేయించి, దాన్ని టీడీపీకి అంటగట్టాలని చూస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు” అని సవిత తెలిపారు.పులివెందులలో టీడీపీ గెలుపు ఖాయమని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

## మొదటిపేజీ తరువాయి

“గత ఏడాదిగా పులివెందులలో ప్రశాంత వాతావరణం నెలకొంది. మా సూపర్‌సిక్స్ పథకాలకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ సానుకూలతల నేపథ్యంలో ఇక్కడి రెండు స్థానాలనూ టీడీపీ కైవసం చేసుకుంటుంది. ఈ నిజాన్ని జీర్ణించుకోలేకే వైసీపీ నేతలు ధర్నాలు చేయడం, పోలీసులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు” అని ఆమె పేర్కొన్నారు.‘జగన్ రప్పా.. రప్పా’ వంటి నినాదాలు, వైసీపీ నేతల అసభ్యకర వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్యబద్ధంగానే ఎన్నికలను ఎదుర్కొంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# కూటమి నేతలంతా కలిసి పులివెందులను గెలుచుకురండి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేరకు నేతలకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి, బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

గత టీడీపీ హయాంలోనే పులివెందులకు కృష్ణా జలాలు అందించి పంటలను కాపాడామని చంద్రబాబు తెలిపారు. ఇప్పుడు పులివెందుల జడ్పీటీసీని గెలుచుకురావాలని... జగన్ కూడా చేయని విధంగా పులివెందులను అభివృద్ధి చేద్దామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

# వైసీపీపై ఉన్న కోపాన్ని వైఎస్ఆర్ విగ్రహాల మీద చూపిస్తారా?: షర్మిల

వైఎస్ఆర్... వైసీపీ సొంతం కాదు, పేటెంట్ హక్కు కాదు. తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడి విగ్రహాలను కూల్చడం ఎక్కడి దిక్కుమాలిన చర్య?” అని షర్మిల ప్రశ్నించారు.నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ వైసీపీ ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించడంపై తమకు అభ్యంతరం లేదని, కానీ అదే సాకుతో విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమని ఆమె స్పష్టం చేశారు. “మహానేత మరణం తర్వాత నాటి ప్రభుత్వం గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ఇప్పుడు ఆ విగ్రహాన్ని తొలగించడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం” అని ఆమె వ్యాఖ్యానించారు.వైఎస్ఆర్ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజాభిమానాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశం స్పష్టమవుతోందని షర్మిల విమర్శించారు. “వైసీపీకి వైఎస్ఆర్ విగ్రహాలకు సంబంధం లేదు. ఆ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజల మనోభావాలను అవమానపరుస్తున్నారు. తొలగించిన చోట వెంటనే రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి. లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నాం” అని ఆమె హితవు పలికారు.

# వాణిజ్య యుద్ధం వేళ భారత్‌కు మరింత చౌకగా రష్యా చమురు..

ప్లాంట్ల మెయింటెనెన్స్ పనులు జరుగుతాయి. ఈ క్రమంలో అక్కడినుంచి భారీఎత్తున ఆయిల్‌ను ఎగుమతి చేసేస్తారు. ఈ ఒత్తిడి కూడా ధరలపై పడుతోందని కేపీఎల్ఈఆర్ హుమయూన్ ఫాలాక్షాహి పేర్కొన్నారు.

ప్రస్తుతం భారత్‌లో రష్యా చమురుకు 37 శాతం మార్కెట్ వాటా ఉంది. దీనిని ఒక్కసారిగా తగ్గించుకోవాలంటే భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని కేపీఎల్ఈఆర్ పేర్కొంది. ప్రస్తుతం చమురు సంస్థలు కూడా రష్యా నుంచి కొనుగోళ్లను నిలిపివేసే అంశాన్ని ఆలోచిస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు కొనుగోళ్లను కొనసాగిస్తున్నాయి. మరోవైపు అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు మే నుంచి మాత్రం రోజుకు 2,25,000 పీపాలకు చేరాయి. ఈ ఏడాది ప్రారంభంతో పోలిస్తే ఇవి రెట్టింపైనట్లు లెక్క.

# ‘మైక్రోసాఫ్ట్‌ను ఓపెన్ ఏఐ తినేస్తుంది’.. మస్క్ వ్యాఖ్యలపై స్పందించిన సత్య నాదెళ్ల

మా భాగస్వామి ఓపెన్‌ఏఐ నుంచి వచ్చిన అత్యంత శక్తిమంతమైన మోడల్ అని ఆయన పేర్కొన్నారు. ఇది విశ్లేషణ, కోడింగ్, చాట్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొస్తుందని తెలిపారు. ఇది మైక్రోసాఫ్ట్ లో శిక్షణ పొందిన మోడల్ అన్నారు.

జీపీటీ-5ని ఉద్దేశిస్తూ ఎలాన్ మస్క్ స్పందించారు. ‘ఏదో ఓ రోజు ఓపెన్‌ఏఐ మైక్రోసాఫ్ట్‌నే తినేస్తుంది’ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓపెన్‌ఏఐపై ఎప్పటిలానే తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. మస్క్ చేసిన వ్యాఖ్యలపై సత్య నాదెళ్ల కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. ‘దీనికోసం గత 50 ఏళ్లుగా చాలామంది ప్రయత్నిస్తున్నారు. ప్రతిరోజూ కొత్తగా నేర్చుకోవడం, భాగస్వాములు కావడం, పోటీపడడం కొనసాగుతోంది” అంటూ కౌంటర్ ఇచ్చారు. “ఓపెన్‌ఏఐ అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ ఆవిష్కరిస్తే.. ఆ తర్వాత జెమిని, గ్రోక్ వాటిని అందిపుచ్చుకుంటూ ఉంటాయి” అనే అర్థం వచ్చేలా ఓ వ్యక్తి ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. ‘గ్రోక్ 4 ఇప్పటికే పవర్‌ఫుల్ ఏఐ మోడల్’ అంటూ ఎలాన్ మస్క్ బదులిచ్చారు.

# ‘ఉజ్వల’ కొనసాగింపు, సాంకేతిక విద్యకు ‘మెరిట్’ స్కీమ్.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 08)

ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇందుకోసం రూ.12,000 కోట్లు కేటాయించింది. సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి %ఖజూష్ట్రఊజూ% పథకానికి ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్.. ఇందుకోసం రూ.4,200 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది.ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్‌ను కేంద్రం సబ్సిడీపై అందిస్తోంది. దీన్ని 2025-26 ఆర్థిక సంవత్సరానికి కొనసాగించేందుకు కేంద్రం నిర్ణయించగా.. దేశ వ్యాప్తంగా 10.33 కోట్ల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. సాంకేతిక విద్యా అభివృద్ధికి %ఖజూష్ట్రఊజూ% పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.4,200 కోట్లు కేటాయించింది. 275 సాంకేతిక విద్యా సంస్థల్లో దీనిని అమలు చేయనున్నారు. నైపుణ్యాలు, ఉపాధి అవకాశాల పెంపు ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 7.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నట్లు అంచనా.వీటితోపాటు అస్సాం, త్రిపురలకు రూ.4,250 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, తమిళనాడులో మరక్కానం-పుదుచ్చేరి నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

# అవన్నీ చిల్లర విమర్శలు.. పట్టించుకోను మంత్రి నారాయణ

ఏమీ లేకపోవడంతో వీఆర్‌సీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చదివిన పాఠశాలను అభివృద్ధి చేస్తుంటే కొందరు ఓర్వలేక పోతున్నారని వైకాపా నేతలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. పేద పిల్లలకు అన్ని సదుపాయాలతో ఉచితంగా విద్యను అందించడమే తన లక్ష్యమన్నారు. అందులో భాగంగానే నారాయణ విద్యాసంస్థలకు చెందిన మెటీరియల్ సైతం ఇచ్చామని వ్యాఖ్యానించారు. వీఆర్‌సీ హై స్కూల్‌ను చూసిన తర్వాత మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోనూ ఓ పాఠశాలను ఆధునీకరిస్తున్నారని గుర్తు చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా.. వీఆర్‌సీ హైస్కూల్ తరహాలో అన్ని పాఠశాలలను అభివృద్ధి చేస్తానన్నారు. ఇలాంటి చిల్లర విమర్శలు చేస్తే.. 11 స్థానాల నుంచి వైకాపా జీరోకి పడిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.

# అక్రమ మద్యం స్వాధీనం మహిళ అరెస్టు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)

అక్రమ మద్యం విక్రయిస్తున్న కేసులో మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ సిఐ అరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నిత్యం నిర్వహించే తనిఖీల్లో భాగంగా శనివారం పొదిలి మండలంలోని నిమ్మవరం, బుచ్చనపాలెం, ఏలూరు ప్రాంతాలతో పాటు కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల జంక్షన్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టామన్నారు. చిన్నారికట్ల జంక్షన్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ నుంచి 180 ఎంఎల్ 35 సిల్వర్ స్ట్రిప్స్, ఆఫీసర్స్ ఛాయిస్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. అక్రమ మద్యం విక్రయించిన మహిళను కోర్టులో హాజరుపరచనున్నట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# 12న వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా 17 మహాసభలు

## 12న ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 8)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా 17 మహాసభలు ఆగస్టు 12, 13 తేదీల్లో కనిగిరిలో జరుగుతున్న సందర్భంగా 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు టీచర్స్ అకాడమీ నుండి ప్రదర్శన, 4 గంటలకు క్లబ్ రోడ్‌లో బహిరంగ సభ జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి తెలియజేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్ లో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ తేదీ జరిగే బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు క్లబ్ రోడ్ లో జరిగే బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. 13వ తేదీ టీచర్స్ అకాడమీలో ప్రతినిధుల సభ జరుగుతుందని, జిల్లా నలుమూలల నుండి 250 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సభల్లో నేటి వ్యవసాయ రంగం పరిస్థితి పాలకులు అనుసరిస్తున్న విధానాలు, రైతులు, రైతు కూలీల మీద పడుతున్న ప్రభావం ప్రధానంగా చర్చ జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాబోయే కాలంలో చేపట్టబోయే ఉద్యమాలను ఈ మహాసభలో రూపొందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి పి సి కేశవరావు, రైతు సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొమ్మాలపాటి మాల్యాద్రి, డివైఎఫ్ఐ నాయకులు పి నరేంద్ర , మహిళా నాయకురాలు కే వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 09.08.25 శనివారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 8)

శుక్రవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కందుకూరు (తరువాయి 4లో...)

# రైతులకు అండగా ఎమ్మెల్యే కందుల

**వైట్ బర్లి పొగాకు కొనుగోలుకు ఐటీసీతో ఒప్పందం**

**రైతుల సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు**

**12 వేల క్వింటాళ్లకు కొనుగోలు హామీ**

**రైతుల్లో కొత్త ఉత్సాహం**

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఆగస్టు 8)

మార్కాపురం నియోజకవర్గ రైతుల జీవనోపాధికి ప్రధానమైన వైట్ బర్లి పొగాకు కొనుగోలు సమస్యపై స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తక్షణ చర్యలు తీసుకొని రైతుల ఆవేదనకు ముగింపు పలికారు. మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించిన ఆయన, ఐటీసీ కంపెనీతో జరిగిన చర్చల ఫలితాన్ని రైతులకు వివరించారు. ముందుగా మార్కాపురం మండలంలోని వైట్ బర్లి పొగాకు పండించే రైతుల బృందం ఎమ్మెల్యేను కలిసి, ఈ సంవత్సరం పొగాకు కొనుగోలు చేసే ప్రధాన కంపెనీ అయిన ఐటీసీ, రాబోయే సీజన్‌కు ఇండెంట్ ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండెంట్ లేకపోతే ఈ ప్రాంతంలో వైట్ బర్లి సాగు పూర్తిగా దెబ్బతింటుందని, పెద్ద మొత్తంలో రైతులు నష్టపోతారని, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వారు తెలిపారు. "ఇప్పటికే విత్తనాలు సిద్ధం చేసుకున్నాం. మార్కెట్ లేకపోతే మొత్తం పెట్టుబడే వృథా అవుతుంది" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఐటీసీని ఒప్పించిన ఎమ్మెల్యే కందుల**

రైతుల ఆవేదనను గమనించిన వెంటనే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఐటీసీ కంపెనీ ప్రతినిధులను నేరుగా పిలిపించికొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం మార్కాపురం నియోజకవర్గం నుండి దాదాపు 12 వేల క్వింటాళ్ల వైట్ బర్లి పొగాకు కొనుగోలు చేసే ఐటీసీ, ఈ సారి కూడా కొనుగోలు కొనసాగించాలనే దిశగా చర్చలు జరిపారు. దీని ఫలితంగా ఈ సీజన్‌లో మార్కాపురం నియోజకవర్గ రైతుల నుండి సుమారు 12 వేల క్వింటాళ్ల వైట్ బర్లి పొగాకు కొనుగోలు చేయడానికి కంపెనీ అంగీకరించింది.

**పరస్పర సహకారం అవసరం**

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే ఇరువర్గాలూ లాభపడతారు. ఉభయ కుశలోపరి కోసం సఖ్యత అవసరం. ఈ ప్రాంత రైతులు నష్టపోకుండా ఉండేందుకు నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను అని అన్నారు. తన జోక్యంతో రైతుల సమస్య తక్షణమే పరిష్కారం కావడం సంతోషకరమని, ఈ సీజన్‌లో మంచి ధరలు రావాలని ఆకాంక్షించారు.





**రైతుల ఆనందం – కృతజ్ఞతలు**

ఐటీసీ అంగీకారంతో రైతులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం మాకు ఊపిరి పీల్చుకునేలా చేసింది. మా శ్రమ వృథా అవుతుందేమో అనుకున్నాం, కానీ ఎమ్మెల్యే కందుల ప్రయత్నం మాకు కొత్త ఆశనిచ్చింది అని పలువురు రైతులు అన్నారు. వచ్చే సీజన్‌లో వైట్ బర్లి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ మద్దతు, మార్కెట్ భరోసా ఉంటే రైతులు నష్టపోరని వారు చెప్పారు.

**ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం**

మార్కాపురం నియోజకవర్గంలో వైట్ బర్లి పొగాకు సాగు అనేది అనేక కుటుంబాల జీవనాధారంగా మారింది. ప్రతి సంవత్సరం వందలాది రైతులు ఈ పంటపై ఆధారపడుతుంటారు. కొనుగోలు భరోసా లభించడంతో, కూలీలు, రవాణా రంగం, సంబంధిత వ్యాపారాలు కూడా లాభపడతాయని అంచనా. ఈ పరిణామం రైతుల జీవనోపాధికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనుంది.

# కొండపి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు

**ఆస్పత్రిలో మహిళకు తొలిసారి సిజేరియన్ డెలివరీ చేసిన వైద్యులు**



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 8)

కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళకు సిజేరియన్ డెలివరీ చేసిన వైద్య బృందానికి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు తెలిపారు. గురువారం కొండపి మండలం గుర్రపడియకు చెందిన సొంగా గౌతమి పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరింది.సాధారణ కాన్పు కష్టంగా మారిన తరుణంలో వైద్యులు సిజేరియన్ డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ సురక్షితంగా ఉన్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ కె నాగమణి, డాక్టర్ గీత, డాక్టర్ నిఖిల్, డాక్టర్ వరుణ్ తేజ్, ఆసుపత్రి సిబ్బందిని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటిసారి సిజేరియన్ డెలివరీ చేయడం అభినందనీయమని, ఇది ఆసుపత్రిలో అందుతున్న నాణ్యమైన వైద్యసేవలకు నిదర్శమన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కావాల్సిన పరికరాలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పేదలు వైద్యం కోసం ఆర్థికంగా చితికి పోకూడదనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందుకనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు.

# డెంగ్యూకు చెక్ పెట్టేందుకు బాపట్ల యంత్రాంగం సిద్ధం

**ప్రతి గ్రామంలో ఫాగింగ్ తప్పనిసరి**

**ప్రజలు జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి**

**అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 8)

జిల్లాలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిర్వహణ చర్యలను సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో 18 డెంగ్యూకేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఫాగ్గింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, వారంలో ఒక రోజు 'డ్రై డే'గా పాటించి నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఫీవర్ సర్వేలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో గాంబూషియా చేపలు వదలడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఐవి ఫ్లూయిడ్లు, మంచాలు ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆర్ఎంపిలు ప్రాథమిక చికిత్సకే పరిమితమవ్వాలని హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్య బాధ్యత వార్డెన్లపై ఉండాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ప్రతి డెంగ్యూకేసును ఖచ్చితంగా నివేదించాలని, సమయానికి సమాచారం అందితే మెరుగైన చికిత్స కల్పించగలమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించాలని (తరువాయి 4లో...)

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించి, వాటికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రధానంగా కందుకూరుకు ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణం,గతంలో సీఎం కందుకూరు పర్యటన సందర్భంగా మున్సిపాలిటీకి కేటాయించిన 50 కోట్ల నిధులు, వాటి అభివృద్ధి పనుల గురించి, గుడ్లూరు మండలం చినలాటరిపి వద్ద హార్టికల్చర్ కాలేజీకి శాశ్వత భవనాల కోసం నిధులు మంజూరు చేయాలని. వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నాగేశ్వరరావు విన్నవించారు. ముఖ్యమంత్రి స్పందించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని నాగేశ్వరరావుకి హామీ ఇచ్చారు.

# నకిలీ వార్తలు - తప్పుడు సమాచారాల నివారణ పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ తనిఖీ యూనిట్ల సమాచారంతో ఇంటర్నెట్ లో నకిలీ వార్తలు ,తప్పుడు సమాచారాలు ఇచ్చే అన్ని ప్రసార మాధ్యమాలు, నిర్వహిస్తున్న కంపెనీలు - వ్యక్తుల గుర్తింపు, వసూలుచేసిన మొత్తం ,ప్రైవేటు తనిఖీ యూనిట్ల వాడకం గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార , ప్రసార శాఖ సహాయక మంత్రి డాక్టర్ యల్ మురుగన్ సమాధానమిస్తూ తప్పుడు సమాచార వెబ్ సైట్ల వలన సామాజిక నిర్మాణం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. దేశ సార్వభౌమాధికారం, రక్షణ, సమగ్రత, రాష్ట్ర, ప్రజా శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని అలాంటి వెబ్ సైట్లను అడ్డుకోడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000 ను ప్రభుత్వం జారీచేసిందని తెలిపారు. కేంద్రానికి సంబంధించి వచ్చే నకిలీ వార్తలను అడ్డుకోడానికి కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖ వాస్తవ తనిఖీ యూనిటును 2019 నెలకోల్పిందని, నకిలీ వార్తల యదార్ధతను యూనిటు పరిశీలించి, యదార్ధాన్ని తన సామాజిక మాధ్యమ వేదికలలో ఉంచుతుందని తెలిపారు. యదార్ధ సేకరణకు ప్రైవేటు తనిఖీ యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటుచేయలేదని, తప్పుడు సమాచారాల పరిష్కరణకు ఇతర చట్టపర నిభందనలు ఏర్పాటు చేసిందని తెలిపారు. వార్తా పత్రికలు, టెలివిజన్, డిజిటల్ మాధ్యమాలు జర్నలిస్టిక్ ప్రవర్తన నిభందనలక, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేబుల్ టెలివిషన్ నెట్ వర్క్ రెగ్యులేషన్ చట్టం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ క్రింద రూపొందించిన నిబంధనలకు తప్పక కట్టుబడివుండాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వాటిపై విచారణ జరిపి తగు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

# డెంగ్యూకు చెక్ పెట్టేందుకు బాపట్ల యంత్రాంగం సిద్ధం



సూచించారు. తాగే నీటికి మూతలు వేయాలని, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్న హామీ ఇచ్చారు. సెలవు దినాలలోను అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై మానిటరింగ్ పెంచాలని డీపీఓను, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. తాగే నీటి ట్యాంకుల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని అధికారులకు, పాఠశాలల్లో డెంగ్యూపై అవగాహన తరగతులు నిర్వహించాలంటూ విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లక్ష్మీనర్సారెడ్డికి ఘన నివాళులు






(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)

మానవత సభ్యుడు, మానవత కార్యాలయ భవనానికి ఇటీవల విరాళం అందించిన దాత, రిటైర్డ్ ఉపాధ్యాయులు పల్లెర్ల లక్ష్మీ నరసారెడ్డి (63) శుక్రవారం అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. స్వస్థలం మండలంలోని బుచ్చనపాలెం అయినప్పటికీ వారి కుమారులు సాయి సందీప్‌రెడ్డి ప్రతిభా పాటవాలతో ఎంసెట్, ఐఐటి టాప్ ర్యాంకర్ గా పొదిలి పేరును దేశ చిత్రపటంలో గుర్తింపు కలిగేలా పరిచయం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన తండ్రిగా, ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతమైన పౌరులుగా దేశానికి అందించిన ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరు ప్రఖ్యాతలు పొందిన వ్యక్తి, స్నేహశీలి, మృదు స్వభావి, ఎంతో మందికి ఆదర్శప్రాయుడుగా నిలిచిన ఆయనకు పలువురు మానవతా సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. బుచ్చనపాలెంలోని ఆయన నివాసంలో ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, డైరక్టర్ కాటూరి వెంకట నారాయణబాబు (పెదబాబు), జిల్లా కార్యదర్శి ఆవులూరి యలమందారెడ్డి, పొదిలి మండల కార్యదర్శి బండి అశోక్, మీడియా ప్రతినిధి షేక్ బాజీ కరిముల్లా, షేక్ రసూల్ మహమ్మద్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొని నివాళులర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## మన సంప్రదాయన్ని మనమే కాపాడుకోవాలి

## విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజిని



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 8)

బాపట్ల పట్టణంలోని స్థానిక రామ్ నగర్ వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ గుడిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు సమాజ సేవకురాలు ఆధ్యాత్మికవేత్త అయినటువంటి బండ్రెడ్డి రజని స్థానిక మహిళలకు పసుపు, కుంకుమ పండు తాంబూలంతో పాటు ఆవు దూడ ఉన్న బొమ్మ తో కూడిన జూట్ బాగ్స్ అందించారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి రజిని మాట్లాడుతూ. హిందూ సాంప్రదాయాన్ని కాపాడుకోవడంతో పాటు మన పర్యావరణ కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదని అన్నారు. గోమాతని పూజించడం మన సంప్రదాయం ఆవు పాలు,పెరుగు,నెయ్యి మన ఆరోగ్యం కాపాడటానికి ఎంతో దోహద పడతాయని, ఆవు పేడతో కళ్ళాపు చల్లుకోవడం వలన క్రిమి కీటకాలు మన పరిసరాల దరిదాపు చేరవన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన మనకు తెలియకుండానే క్యాన్సర్ బారిన పడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడడం మానేసి జనప నారా సంచులు గుడ్డ సంచులు వాడాలన్నారు. మన పర్యావరణన్ని మనమే పరిరక్షించుకోవలని అన్నారు మన సాంప్రదాయమే కాదు పర్యావరణ పరిరక్షణ కూడా మన బాధ్యత అన్న సిబలిక్ కోసమే ఆవు దూడ బొమ్మలతో కలసిన జ్యూట్ బ్యాగులను పంచుతున్నానని రజని అన్నారు.అనంతరం అందరు కలిసి సామూహిక హారతి ఇచ్చారు. అలాగే మనిద్వీప వర్ణన చదివారు. శుక్రవారం విశిష్టత ఏమిటంటే వారాహి అమ్మవారు యొక్క జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేసి అమ్మవారి యొక్క మహత్యం గురించి రజని వివరించారు.అమ్మవారి ఆశీసులు మనందరి మీద ఉండాలని కోరారు.

# ముప్పలపాడులో వరలక్ష్మీ వ్రతం

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 8)

మండలంలోని ముప్పలపాడు గ్రామంలో వెలిసిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికే కుంకుమ పూజ నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టత గురించి భక్తులకు ఆలయ పూజారి ఈ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగ జట్లు ఎంపిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగ జట్ల ఎంపికలు ఈ నెల 10వ తారీకు న యోగసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా, ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఒంగోలు గద్దలగుంట నందు గల ఎస్‌పికె సంస్కృత పాఠశాల నందు ఉదయం 10 గంటలకు జరుగుతాయాని జిల్లా అధ్యక్షులు మరియు కార్యదర్శి తెలియ జేసినారు. ఈ పోటీలలో పాల్గొనుటకు 8 సంవత్సరాల నుండి ఆ పై వయసు కలవారు అర్హులు. ఈ పోటీలకు వచ్చు వారు తమ పుట్టిన తేది సర్టిఫికెట్ ను సమర్పించి తమ తమ వయసు కేటగిరి లలో పాల్గొనవచ్చు. ఎంపికైన వారు తదుపరి పశ్చిమ గోదావరి జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి యోగసన పోటీలలో పాల్గొన వలసి ఉంటుంది. పోటీలలో పాల్గొను వారు ఆదివారం క్రింది నెంబరుకు రిపోర్ట్ చేయాలన్నారు. ఫోన్ 9030965970, 9849429839ను సంప్రదించాలని కోరారు.

# ఎస్‌టిఎఫ్ఐ 9వ ఆలిండియా ట్రైనియల్ కాన్ఫరెన్స్









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**

ఎస్‌టిఎఫ్ఐ 9 వ ఆలిండియా ట్రైనియల్ కాన్ఫరెన్స్ కలకత్తా నగరం మహాజాతి సదన్ నందు ఆగస్టు 8, 9, 10 తేదీలలో జరుగుతోంది. ఈ ఎస్‌టిఎఫ్ఐ జాతీయ మహాసభలకు 29 రాష్ట్రాల నుండి సుమారు 370 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి 76 మంది అందులో ప్రకాశం జిల్లా నుండి ముగ్గురు పాల్గొంటున్నారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి పి బాల వెంకటేశ్వర్లు హాజరైనారు. తొలిరోజు ఎనిమిదో తేదీ ఎస్టిఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ సీఎం భర్తీ అధ్యక్షతన ప్రారంభమైనది. ప్రారంభ ఉపన్యాసంలో ప్రొఫెసర్ సైమన్ చక్రవర్తి కలకత్తా యూనివర్సిటీ , ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ కఫీ జాదవ్ యూనివర్సిటీ , ప్రొఫెసర్ సిద్ధార్థ దత్త, జాదవ యూనివర్సిటీ వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటికరణ కాకుండా కాపాడాలని క్రింది స్థాయిలో గ్రామీణ పేద బడుగు బలహీన వర్గాలకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు.అయితే ఎన్ఈపీ 2020 విద్యా విధానం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొని రావడం వల్ల కేంద్ర ప్రభుత్వం లోని మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే విద్యాశాఖ, ఏఐసీటీ, ఎన్ఈఈటీ, ఎన్ఈటీ, ఏఐసీటీఈ, గేట్, ఎన్‌సీఈఆర్‌టీ,యుజీసీ, మొదలగు స్వతంత్ర సంస్థలు అన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లినాయి. ఎన్ఈపీ 2020 వలన దేశంలో 50 శాతం యూనివర్సిటీలు ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. ఉదాహరణకు 2014-15లో 236 యూనివర్సిటీలు ఉంటే 2023- 24 లో536యూనివర్సిటీలు ప్రైవేటు రంగంలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం మతాన్ని ఉపయోగించి కార్పొరేట్ ద్వారా విద్యను వ్యాపారం చేస్తుంది ప్రపంచమంతా శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళ్తుంటే భారతదేశం మాత్రం పేద ,మూఢత్వం, మతాన్ని ఉపయోగించి ముందుకు తీసుకెళుతుందని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చేసుకుంటుందనిఅన్నారు. భారతదేశ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన అనేక భిన్నజాతులు, మతాలు కులాలు కలిగిన దేశమని ,భారతదేశానికి కావలసిన ప్రజాస్వామ్య ,లౌకిక, శాస్త్రీయ విద్యను అందించాలి. ముఖ్యంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సమాజం మీద ఉందని సమాజాన్ని నిత్యం చైతన్యవంతం చేయాలని అన్నారు. భారత దేశంలో విద్యా వ్యవస్థను కొఠారి కమిషన్‌ను అమలు చేయాలని కామన్ స్కూల్ సిస్టం తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విద్యాసంస్థలను ప్రభుత్వమే నడపాలని అన్నారు. అందుకోసం కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాన్ని అక్కడికి వెళ్లి పరిశీలించి దానిని ఇంప్లిమెంట్ చేయాలని వక్తలు కోరారు.

# గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ మంత్రి సురేష్





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 8)**

మండలంలోని చెరువుకూరుపాలెం గ్రామంలో పిల్లి తిరుపతిరెడ్డి నూతన గృహప్రవేశం సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యులు, కొండేపి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. ఈ నూతన గృహ ప్రవేశం కార్యక్రమం నందు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రైతన్నలకు ఊరట ఇచ్చిన వర్షం



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 8)**

మండలంలో ఎండలు మండిపోతు వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సమయంలో శుక్రవారం కురిసిన వర్షం రైతన్నలకు ఎంతో పోరాటానిచ్చింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మళ్లీ ఈ వర్షం రైతుల హృదయాలు ఆశల దీపం వెలిగించింది. గత కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం వల్ల సాగు తీవ్రంగా పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అప్పులు చేసి భూముల్లో విత్తనాలు వేసినా రైతులు విత్తనాలు మొలకెత్తక నిరాశలో కూరుకు పోయారు. ఈ వర్షంతో రైతులు , పశుపోషకులు ఆనందం వ్యక్తపరిచారు. ఖరీఫ్ పంటల సాగుకు ఇది అనుకూలమైన సమయం కావడంతో రైతులు మళ్లీ విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరి ,మొక్కజొన్న, పప్పు దినుసులు వంటి పంటలకు మంచి సమయం ఉంది.

# శ్రీ హరి హర క్షేత్రంలో వైభవంగా కుంకుమ అర్చనలు



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు 8)**

శ్రావణ మాసం శుక్రవారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలతో సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు క్షేత్రంలో కొలువై వున్న సర్వ దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. శిద్దా వెంకటేశ్వర్లు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ అర్చకులు హరి వెంకట కుమారా చార్యులు పూజాది కార్యక్రమం నిర్వహించారు.





# నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కి క్షీరాభిషేకం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**

ఒంగోలు నగరంలో నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల్ని ఆదుకున్న ఘనత అప్పటికి ఇప్పటికీ ఒక చంద్రబాబునాయుడుకే చెందుతుందని గతంలో కూడా ఆదరణ పథకం ద్వారా నాయి బ్రాహ్మణ ఆదుకున్నారు. తర్వాత 150 యూనిట్లు ఉచిత విద్యుత్తు బార్బర్ కేటాయించడం జరిగింది. మరలా 50 యూనిట్లు పెంచుతూ 200 యూనిట్లు చేసి నాయి బ్రాహ్మణ ఆదుకోవడం జరిగింది. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక దామచర్ల జనార్దన్ రావుకి ఒంగోలు నియోజకవర్గం నాయి బ్రాహ్మణులుగా మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానూరి రమేష్, పెళ్లూరి చిన్న వెంకటేశ్వర్లు, పిలుట్ల సుధాకర్ రావు, అన్నవరపు వెంకటరావు, కొణిజేటి రామకృష్ణ , గుంటూరు సారథి, నిడమానూరి యలమందరావు, బూసరపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్స్‌కి రహదారి భద్రత పై అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 8)

కందుకూరు సిఐ అన్వర్ బాషా పట్టణం లోని ఉన్నటువంటి ఆటో డ్రైవర్స్ కి శుక్రవారం శ్రీ లక్ష్మీ శ్రీనివాస కళ్యాణ మండపము నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ లైసెన్సు మరియు వెహికల్ కి సంబంధించిన రికార్డ్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని,ఓవర్ లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మొదలైన సూచనలు చేశారు. ఎవరైనా రూల్స్ అతిక్రమించిన ఎడల వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శివనాగరాజు, పోలీస్ సిబ్బంది, డ్రైవర్స్ పాల్గొన్నారు.

# హైవే వెహికల్‌ను ఢీకొన్న మినీ వెహికల్









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 8)

మండల పరిధిలోని వీరేపల్లి క్రాస్ రోడ్ జంక్షన్ సమీపంలో శుక్రవారం ఉదయం 11.40 నిమిషాల సమయంలో జంక్షన్ సమీపంలోని వెంచర్ వద్ద నేషనల్ హైవే ఎన్ హెచ్ 16 రోడ్డు మీద తమిళనాడు నుంచి విజయవాడ వైపు అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన మినీ వెహికల్ నేషనల్ హైవే అథారిటీకి చెందిన వాటర్ ట్యాంక్ రోడ్డు మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పోస్తున్న సమయంలో వెనుకవైపున ఢీకొంది. దీంతో అశోక్ లేలాండ్ బండికి చెందిన డ్రైవర్ తమిళనాడు పాండురంగ నగర్‌కు చెందిన మహమ్మద్ రియాజ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఇంటింటికి జాతీయ జెండా ఎగరేద్దాం

### దేశ సమైక్యతను చాటిద్దాం

### మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

### ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 8)

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం పురస్కరించుకొని స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ముక్కు కాశిరెడ్డి కాలనిలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనిలో దేశ భక్తిని చాటుతూ స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పిస్తూ "వందేమాతరం" హర్ ఘర్ తిరంగా " స్వరాజ్యం మన జన్మ హక్కు అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్వాతంత్రం కోసం చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని వివరించారు. "హర్ ఘర్ తిరంగా" నినాదం భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు తమ ఇళ్లలో భారత జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటుకోవాలని ప్రోత్సహిస్తుందని ఈ ప్రచారం ద్వారా, ప్రతి ఇంటిలో జెండా ఎగురవేయడం ద్వారా ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ప్రజలలో దేశభక్తి భావాలను పెంపొందించడానికి మరియు జాతీయ ఐక్యతను బలోపేతం చేయడానికి "హర్ ఘర్ తిరంగా" ప్రచారం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రచారం ద్వారా, దేశవ్యాప్తంగా ప్రజలు ఒకే జెండా కిందకు వచ్చి జాతీయ సమైక్యతను చాటుకుంటారని ఇది భారతీయ సంస్కృతి, వారసత్వం యొక్క ప్రాముఖ్యతను కూడా తెలియజేస్తుందని అన్నారు. అనంతరం చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ విద్యార్థులకు జాతీయ జెండాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో బంగారు బాల్యం కమిటి సభ్యులు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ చైర్మన్ గంధం శ్యాముల్ గెర్షోమ్, కోఆర్డినేటర్ పి నవ కుమార్, అంగన్వాడీ టీచర్ దుర్గ, స్థానిక ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







# ఒంగోలు రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

### గంజాయి, మాదకద్రవ్యాల పై కఠిన చర్యలతో

### ముందుకు సాగుతున్న ప్రకాశం జిల్లా పోలీసులు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా రాష్ట్రంలో చేపట్టిన చర్యల్లో భాగంగా, ప్రకాశం జిల్లా పోలీసులు ఒంగోలు రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, ఆర్పీఎఫ్ , జీఆర్పీ సిబ్బంది, మాదకద్రవ్యాలను గుర్తించే డాగ్ స్క్వాడ్ తో కలిసి ఈ తనిఖీలు జరిగాయి. తనిఖీల్లో భాగంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు, ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. పూరి ఎక్స్‌ప్రెస్‌లో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు అనుమానితుల వ్యక్తులను అదుపులోకి తీసుకొని తదుపరి దర్యాప్తు నిమిత్తం జిఆర్పి పోలీసులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశం. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి ,మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలియజేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఆంజనేయులు, శ్రీకాంత్, మధుసూదన్ రావు, చెంచయ్య, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు, ఈగిల్ టీం, సిబ్బంది పాల్గొన్నారు.



# కొచ్చర్లకోట కాలువ పూడికతీత పనులకు శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 8) మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని పలు కార్యక్రమాల్లో









పాల్గొన్నారు. మొదటిగా పట్టణంలో పెదనాగులవరం రోడ్ లోని 37 లక్షలతో చేపట్టిన కొచ్చర్లకోట కాలువ పూడికతీత పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్ద నాగులవరం రోడ్ లోని బాలికల ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో ముచ్చటిస్తూ పలు ప్రశ్నలు స్పందించి వారి ప్రతిభను గుర్తించారు. అనంతరం స్కూల్ స్టాప్ కొన్ని ప్రతిపాదనలను గౌరవ శాసనసభ్యుల వారి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్ లో జరిగిన మార్కాపురం పట్టణ మాస్టర్ ప్లాన్ పై మేధావులు, అధికారులు, పుర ప్రముఖులతో చర్చించారు. ఈ సమావేశంలో అధికారులు పవరు పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వచ్చే 20 ఏళ్లలో మార్కాపురం పట్టణం ఏరకంగా ఉండబోతుందో అందరికీ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారు మాట్లాడుతూ గతంలో 2002 సంవత్సరంలో మాస్టర్ ప్లాన్ తయారు చేశారని అనంతరం తిరిగి 23 సంవత్సరాలు తర్వాత ఇప్పుడు మార్కాపురం మాస్టర్ ప్లాన్ పై సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఎవరికైనా మాస్టర్ ప్లాన్ పై అభ్యంతరాలు ఉంటే అధికారులకు అర్జీల రూపంలో అందజేయవచ్చుని అన్నారు.

# విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఇంటూరిలకు ధన్యవాదాలు తెలిపిన బిజెపి నాయకులు ఉన్నం సింహాద్రి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 8)

మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన బిజెపి నాయకులు ఉన్నం సింహాద్రి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులకు అనంతసాగరం ప్రజల తరఫున సింహాద్రి ధన్యవాదాలు తెలిపారు. గతంలో అనంతసాగరానికి పొన్నలూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. చిన్న చిన్న గాలులకి విద్యుత్ అంతరాయం జరిగి ఆ గ్రామస్తులు ఇబ్బంది పడుతుండేవారు. ఈ విషయాన్ని సదరు విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి, స్థానిక శాసనసభ్యులు దృష్టికి సింహాద్రి తీసుకుని వెళ్ళగా కందుకూరు సబ్ స్టేషన్ నుండి అనంత సాగరానికి విద్యుత్ కలెక్షన్ ఇచ్చారు. అందువలన విద్యుత్ కి ఎటువంటి అంతరాయం లేకుండా ఉంటుంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ లో భాగంగా రామతీర్థం నీటిని అనంత సాగరానికి తీసుకొని వస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుగారికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గతంలో గుంటలు పడి ఉన్న కందుకూరు నుండి విప్పగుంట వెళ్లే 2.5 కిలోమీటర్ల రహదారిని వేయించిన ఎమ్మెల్యేకి ధన్యవాదాలు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉంటే అభివృద్ధి ఇదేవిధంగా జరుగుతుందని సింహాద్రి ధీమా వ్యక్తం చేశారు.





# చాగొల్లు గ్రామంలో కళ్యాణ మండపం ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

## చాగొల్లు గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 8)

మండలంలోని చాగొల్లు గ్రామంలో వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపంను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ముందుగా గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ కలిసి కళ్యాణ మండపం నిర్మించుకోవటం శుభపరిణామం అని తెలిపారు. చాగొల్లు గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులు, వర్ధినేని శ్రీనివాసులు, కడియాల సుబ్బారావు, రావి మహేష్, వల్లూరి కొండపనాయుడు, కారసాల అంకపనాయుడు, గుంజి వెంకటరమణమ్మ, కుంచాల శ్రీనివాసులు, తన్నీరు వెంకటరమణయ్య, ఉప్పుటూరి అంకారావు, గుంజి సుబ్బారావు, తన్నీరు





# గర్నెపూడి భాస్కర్ సేవలు చిరస్మరణీయం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 8)

ఒకవైపు ఉద్యోగంలో నిబద్ధత, మరోవైపు సమాజ సేవలో అంకితభావం. ఈ రెండు లక్షణాలను సమన్వయం చేసుకుని, సమాజానికి మార్గ దర్శకుడిగా నిలిచిన గర్నెపూడి భాస్కర్ సేవలు మరువలేనివని ప్రముఖ పాస్టర్ ధూపాటి జార్జి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని చైతన్యనగర్‌లో భాస్కర్ షష్టిపూర్తి వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బంధువులు, కుటుంబ సభ్యులు, సన్నితులు, శ్రేయోభిలాషులు ఆయనను పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఈ వేడుకలో వాతావరణం స్ఫూర్తిదాయకంగా మారింది. 'భాస్కర్ పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తూనే సామాజిక సేవకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. అనాథలు, వృద్ధులు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడ్డారు. ఏకపక్ష లాభం కోసం కాదు, పరమార్థం కోసం జీవించడం ఆయన జీవిత మంత్రం. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. అతను మరింతగా పేర్కొంటూ, సేవ చేయడానికి పదవి, డబ్బు, స్థాయి అవసరం లేదు. మనసున్నవారికి అవకాశాలు సృష్టించుకోవచ్చు. భాస్కర్ అందుకు సజీవ సాక్ష్యం అని అభినందించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, స్నేహితులు, సహచరులు పాల్గొని, ఆయనతో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. ఆపదలో మనతో ఉండే భాస్కర్ సహాయం మరువలేము అంటూ పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ వేడుకలో ప్రార్థనలు నిర్వహించగా, అనంతరం భోజన విందు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు భాస్కర్ ని ఆశీర్వదిస్తూ, ఇలాగే ఆరోగ్యంగా, ఆనందంగా, సేవా మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముటుకూరు శ్యాం రాజు, పాస్టర్లు ప్రేమ్ కుమార్, ఐజక్, ఏసేబు, నూనె విల్సన్, గర్నెపూడి సైమన్, నిరంజన్, దావీదు, ముటుకూరి, సుబ్బారావు, ఆయన పెద్ద కుమారుడు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్ మాదిగ, చిన్న కుమారుడు గర్నెపూడి విలియం కేరి, కూతుర్లు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మొదటి ఏడాది విద్యార్థులకు పూర్వ విద్యార్థుల అతిథి ఉపన్యాసం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ఒంగోలులోని క్విస్ ఇంజినీరంగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా క్విస్ కళాశాలలో చదివి, ఇప్పుడు ఉన్నతస్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తమ అనుభవాలను పంచుకున్నారు. క్విస్ కళాశాలలో మెకానికల్ 2011 - 2015 బ్యాచ్ కు చెందిన ఎస్. జయంత్ బాబు ప్రస్తుతం సర్వీస్ నౌ అనే కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్నారు. జయంత్ తన అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ప్రస్తుతం అవకాశాలు ఎలా ఉన్నాయి? టెక్నాలజీలో వచ్చిన మార్పులు ఏంటి? తదితర విషయాలపై జయంత్ అవగాహన కల్పించారు. క్విస్ లో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతోమంది ఉన్నతస్థానాల్లో ఉన్నారని, ఇక్కడి ఉపాధ్యాయులు, మేనేజ్మెంట్ సహకారంతోనే అది సాధ్యం అయ్యిందని అన్నారు. అప్పటికి ఇప్పటికి కళాశాలలో అద్భుతమైన మార్పులు వచ్చాయని, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాల్లో చాలా మార్పులు జరిగాయని, ఐడియా ల్యాబ్ లాంటివి విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య కమ్యూనికేషన్ పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జయంత్ బాబు చెప్పారు. కళాశాల మొత్తం తిరిగి చూసిన జయంత్ బాబు.. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల దేశంలో ఉత్తమ కళాశాలల్లో ఒకటిగా ఉండటం ఆనందంగా ఉందని, అలాంటి కళాశాలను ఎన్నుకున్నందుకు మొదటి ఏడాది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ అవకాశం ఇచ్చిన విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఉత్తమమైన విద్యను అందిస్తుంది ఎంతోమందిని తీర్చిదిద్దుతున్నారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.



# శ్రీగిరి శ్రీవారికి జూనియర్ సివిల్ జడ్జి దంపతులచే మేల్ చాట్ వస్త్ర సమర్పణ

## శ్రీగిరి పవిత్రోత్సవాలకు శ్రీకారం

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 8)

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నరసరావుపేటకు చెందిన జూనియర్ సివిల్ జడ్జి కంది నరేంద్రరెడ్డి స్వప్న దంపతులు శ్రీగిరి నిలయానికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. వేద పండితులు, అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అంద చేయడంతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు కంది నరేంద్రరెడ్డి దంపతులను అభినందించారు.







శ్రీగిరి పవిత్రోత్సవాలు ప్రారంభం :

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీవారికి శుక్రవార అభిషేకం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారి పవిత్రోత్సవ కార్యక్రమాలు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా జరిగాయి. మేదినీ పూజ, అంకురార్పణ, చతుర్వేద పారాయణ, రక్షాబంధనం కార్యక్రమాలు అత్యంత భక్తి నిష్ఠలతో నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. పవిత్రోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం, సుదర్శనారాధన, హెూమ కార్యమాలు, రాత్రి 9 గంటలకు శ్రీవారికి ఏకాంత సేవ జరుగుతాయన్నారు. శ్రీవారి పవిత్రోత్సవాలలో పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com